క్లుప్తంగా

నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగు

సీఐ ప్రమోద్‌కుమార్



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ ప్రమోద్‌కుమార్

ఆమనగల్లు: ఒకరు నేత్రదానం చేయడంతో ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు ప్రసాదించవచ్చని సీఐ ప్రమోద్‌కుమార్ అన్నారు. నేత్రదానంపై ప్రజలు అపోహలు వీడాలని సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి వైద్యుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 63 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 23 మందిని కంటి ఆపరేషన్ల నిమిత్తం ఎనుగొండలోని రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. లయన్స్‌క్లబ్ అందిస్తున్న సేవలు ఆదర్శంగా ఉన్నాయన్నారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని కలిగి ఉండాలని, తోటివారికి సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆమనగల్లు అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, కార్యదర్శి మహేశ్, జిల్లా చైర్మన్ రమేశ్, యాదయ్య, లయన్ పీఆర్‌ఓ పాషా, సభ్యులు ఎంగలి బాలకృష్ణ, కొర్పి వెంకటయ్య, కొండల్ రెడ్డి, వైద్యాధికారి డా.పరిక్షిత్ నరేందర్, వైద్య సిబ్బంది తిరుపతిరెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

శుద్ధ నీటితో ఆరోగ్యం పదిలం



భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

తలకొండపల్లి: శుద్ధిచేసిన నీరు తాగితే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిధి పడకల్ గ్రామంలో నీటి శుద్ధి కేంద్రం లేక స్థానిక ప్రజలు బోరు నీరు తాగుతున్నారన్న విషయాన్ని పలువురు డోకూరి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సోమవారం గ్రామంలో నీటి శుద్ధి భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జోగు రమేశ్, మాజీ సర్పంచ్ రమేశ్‌యాదవ్, మాజీ ఉపసర్పంచ్ శ్రీశైలంయాదవ్, సీనియర్ నేత తిరుపతిరెడ్డి, నర్సింహ, పెద్దయ్య, రమేశ్, తిరుపతయ్యగౌడ్, రామస్వామి, గౌస్, బషీర్, ఖలీల్, సత్తయ్య, చందూ, కర్ణాకర్, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం



వైద్యుడిని సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులు పరిక్షిత్ నరేందర్, నాగరాజులను లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పట్టణంలోని సాయిబాబా ఆలయం వద్ద ఇటీవల అపస్మారక స్థితిలో ఉన్న 15 నెలల చిన్నారికి వైద్యులు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం ఆస్పత్రిలో వైద్యులను లయన్స్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్ జిల్లా చైర్మన్‌లు యాదయ్య, రమేశ్, కార్యదర్శి మహేశ్, పీఆర్‌ఓ పాషా, సభ్యులు బాలకృష్ణ, కొర్పి వెంకటయ్య, కొండల్‌రెడ్డి, హెచ్‌ఈఓ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కేశవరెడ్డి' సేవలు మరువలేనివి

కడ్తాల్: ప్రభుత్వ ఉద్యోగిగా, సింగిల్‌విండో డైరెక్టర్‌గా దివంగత గూడూరు కేశవరెడ్డి అందించిన సేవలు మరువలేనివని సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాలులో గూడూరు ద్వాదశ దినకర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి చల్లా, కసిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు బీక్యానాయక్, బీచ్యానాయక్, లక్ష్మారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జహంగీర్‌అలీ, వెంకటేశ్, రవీందర్‌రెడ్డి, జయేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, రాజారెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

క్రీడా ప్రాంగణాలు.. నిరుపయోగం

వసతులు, పరికరాల ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యం

- మైదానాల వైపు కన్నెత్తి చూడని క్రీడాకారులు
- లక్షల రూపాయల ప్రజాధనం వృథా
- పట్టించుకోని సంబంధిత అధికారులు



పెంజర్లలో గ్రామానికి దూరంగా ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం

కొత్తూరు: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. ఉపాధి హామీ పథకం కింద లక్షల రూపాయలు ఖర్చు చేసి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. కానీ వాటిల్లో సరైన వసతులు కల్పించకపోవడంతో క్రీడా ప్రాంగణాలు ఎందుకూ పనికిరాకుండా పోయాయి. మరి కొన్ని మైదానాలు ఊరికి దూరంగా ఏర్పాటు చేయడంతో క్రీడాకారులు వాటివైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఉంది. ప్రస్తుతం కొన్నిచోట్ల క్రీడా ప్రాంగణాలకు నిర్వహణ లేక చెట్లు, గడ్డి పెరిగి నిరుపయోగంగా మారాయి. మండలంలో 12 పంచాయతీలకు గాను 7 గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు స్థలాలను గుర్తించారు. కేవలం 3 గ్రామాల్లో మాత్రమే పనులు పూర్తికాగా 4 చోట్ల పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. మిగిలిన 5 గ్రామాల్లో ఇప్పటికీ స్థలాలను గుర్తించలేదు.

వ్యాయామం చేయడానికి వీలుగా..

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ వ్యాయామంపై ఆసక్తి పెంచుకోవడానికి వీలుగా అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. యువత, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ఇలా అన్ని వయస్సుల వారు ఆహ్లాదకరమైన వాతావరణంలో వ్యాయామం చేసేందుకు పలు రకాల ఉపకరణాలను అందుబాటులో ఉంచాలి. ముఖ్యంగా గ్రామాలకు దూరంగా కాకుండా జనావాసాలకు దగ్గరగా ఉండే స్థలాలను గుర్తించాలని క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. నిరంతర వ్యాయామం చేయడంతో అటు ప్రజల్లో ఆరోగ్యంతో పాటు యువత, విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి పెంచడానికి వీలుంటుందని ప్రకటించారు.

క్రీడా ప్రాంగణాల ఏర్పాట్లు ఇలా..

- గ్రామంలో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు స్థానిక పంచాయతీ పాలకవర్గం, మండల స్థాయి అధికారులు స్థలాలను గుర్తించాలి.
- గుర్తించిన స్థలాల్లో మూడు నెలల్లోపు క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలి.
- స్థలాలను బట్టి క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.3 నుంచి 4.50 లక్షల వరకు వెచ్చించేలా మార్గదర్శకాలు ఉన్నాయి. అందులో వాలీబాల్ కోసం నెట్, స్తంభాలు, ఖోఖో కోసం రెండు దుంగలు, ఇతర వ్యాయామాల కోసం రెండు పెద్ద, రెండు చిన్న పోల్స్‌ను ఏర్పాటు చేయాలి.
- గ్రామాల్లో కనీసం 10 గుంటల నుంచి 20 గుంటల్లోపు స్థలాల్లో మైదానాలను ఏర్పాటు చేయాలి.
- వృద్ధులు, మహిళలు వాకింగ్ చేసేందుకు వీలుగా ట్రాక్‌ల నిర్మాణాలు సైతం ఉండాలి.



సిద్ధాపూర్‌లో క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు గుర్తించిన స్థలం

బోర్డులకే పరిమితం

మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. చాలాచోట్ల గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేయడంతో అక్కడికి వెళ్లి వ్యాయామం చేసేందుకు ప్రజలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. మరి కొన్ని చోట్ల స్థలాలను గుర్తించినా పూర్తిస్థాయిలో ఉపకరణాలను ఏర్పాటు చేయలేదు. ఇంకొన్ని చోట్ల క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు అసలు స్థలాలనే గుర్తించలేదు.

వినియోగంలోకి తీసుకురావాలి



లక్షలు వెచ్చించి గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలను అధికారులు వినియోగంలోకి తీసుకురావాలి. వాటి నిర్వహణతో పాటు ప్రజలు, యువకులకు ప్రాంగణాల ఆవశ్యకతపై అవగాహన కల్పించాలి.

– మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ, కొత్తూరు

ప్రతి ఒక్కరిలో సేవాగుణం ఉండాలి

పర్యావరణ అవార్డు గ్రహీత పి.రామకృష్ణారావు

చేవెళ్ల: సామాజిక సేవ చేయాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉండాలని చేవెళ్లకు చెందిన పర్యావరణవేత్త పి.రామకృష్ణారావు అన్నారు. సోమవారం చేవెళ్లకు చెందిన జూకన్నగారి జైపాల్‌రెడ్డి, పావని దంపతులు తమ కుమారుడు గీత్ శ్రీనందన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా చేవెళ్లలోని 4 అంగన్‌వాడీ కేంద్రాలను బీరువాలను, అదేవిధంగా నూతనంగా నిర్మిస్తున్న మల్లన్నగుడికి 50వేల రూపాయల విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా పర్యావరణవేత్త రామకృష్ణారావు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను బీరువాలను అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు దాత జైపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం మల్లన్న ఆలయ నిర్మాణానికి 50వేల రూపాయల విరాళం కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆయనకు అభినందనలు తెలిపి సన్మానించారు. జైపాల్‌రెడ్డి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతూనే ఉంటారని, గతంలో కూడా పలు కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



ఆలయ నిర్మాణానికి విరాళం అందిస్తున్న దాత జైపాల్‌రెడ్డి కుటుంబసభ్యులు

బస్‌స్టేషన్ పనుల పరిశీలన



బస్‌స్టేషన్ విస్తరణ పనులను పరిశీలిస్తున్న మాజీ ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఆర్టీసీ అధికారులు, నాయకులు

చేవెళ్ల: మండల కేంద్రంలో జరుగుతున్న బస్‌స్టేషన్ విస్తరణ పనులను మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి ఆర్టీసీ అధికారులతో కలిసి పరిశీలించారు. సోమవారం ఉదయం చేవెళ్లకు వచ్చిన ఆయన స్థానిక నాయకులతో కలిసి బస్‌స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించారు. బస్‌స్టేషన్ డిజైన్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. స్థానిక నాయకులు బస్‌స్టేషన్ అవుట్ పాయింట్‌ను విలేజ్‌రోడ్డులో ఏర్పాటు చేస్తే ఇబ్బందులు ఉంటాయని దీనిని మార్చాలని మాజీ ఎంపీని కోరారు. ఆయన అధికారులతో మాట్లాడారు. ప్రస్తుతం ఉన్నట్లుగానే ప్రధాన రోడ్డుకు అనుసంధానంగానే బస్‌స్టేషన్ ఇన్, అవుట్ పాయింట్‌లు ఉండేలా చూడాలని చెప్పారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో కూడా మాట్లాడుతానని చెప్పారు. అనంతరం ఆయన చేవెళ్లలోని రచ్చబండ వినాయక పూజల్లో పాల్గొన్నారు. మరో రెండురోజుల్లో ఆయన జన్మదినం ఉండటంతో ఆయన అందుబాటులో ఉండటం లేదని తెలుసుకున్న స్థానిక నాయకులు కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు వసంతం, కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శైలజ, ఆగిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, టీకుపల్లి శ్రీనివాస్, సాయికుమార్‌రెడ్డి, దయాకర్, వెంకట్‌రెడ్డి, తిరుపత్తిరెడ్డి, విఠలయ్య, మాల్లారెడ్డి, అనంత్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

కొత్తూరు: మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో సోమవారం ముస్లింలు మిలాద్‌ఉన్ నబీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా జేపీదర్గా ఆవరణలో ఉన్న మ జీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మతపెద్దలు వారికి పండగ ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. మైనార్టీ నాయకులు పండగ సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్న మైనార్టీ నాయకులు

గణపతి బప్పా మోరియా

- శోభయమానంగా లంబోదరుడి నిమజ్జనోత్సవం
- లడ్డూ వేలంలో ఉత్సాహంగా పాల్గొన్న ప్రజలు
- శోభాయాత్రలో ఆకట్టుకున్న యువతీయువకుల నృత్యాలు

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో వినాయక చవితి ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. పదిరోజుల పాటు విశేష పూజలందుకున్న ఆయా గ్రామాల్లోని గణనాథులను ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం నిమజ్జనానికి తరలిస్తున్నారు. ఈ సందర్భంగా చేపట్టిన స్వామివారి లడ్డూ వేలంలో ప్రజలు, అధికారులు, నాయకులు ఉత్సాహంగా పాల్గొని మహాప్రసాదాన్ని దక్కించుకున్నారు. అనంతరం ప్రత్యేకంగా ముస్తాబు చేసిన వాహనాలపై వినాయకుడి శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో డప్పుచప్పుళ్ల మధ్య కొనసాగిన కళాకారులు, యువతీయువకులు, చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం చెరువుల వద్దకు చేరుకొని గణపతి బప్పా మోరియా.. ఆదా లడ్డూ కాలియా.. అంటూ భక్తజనం లంబోదరుడికి నీరాజనం పలికారు. బైబై గణేశా అంటూ.. గంగమ్మ ఒడికి చేర్చారు. నిమజ్జనోత్సవ నేపథ్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



శంకర్‌పల్లి: రావులపల్లికలాన్‌లో లడ్డూ దక్కించుకున్న శ్రీరాములుగౌడ్



మొయినాబాద్‌రూరల్: అజీజ్‌నగర్ హనుమాన్ దేవాలయంలో..



మొయినాబాద్: సురంగల్‌లో స్వామివారి లడ్డూలను దక్కించుకున్న గ్రామస్తులు



చేవెళ్ల: చేవెళ్లలోని అంబేద్కర్‌నగర్ పోచమ్మ గుడి కాలనీలో..



చేవెళ్ల: రజకనగర్ కాలనీలో స్వామివారి ప్రసాదాన్ని దక్కించుకున్న శివకుమార్



చేవెళ్ల: అంబేద్కర్‌నగర్ కాలనీలో లడ్డూ దక్కించుకున్న బురాన్ బద్రర్స్



షాద్‌నగర్‌రూరల్: లడ్డూ కైవసం చేసుకున్న రమేశ్‌గౌడ్



చేవెళ్ల: చేవెళ్లలోని న్యూ జర్నలిస్ట్ కాలనీలో..



మొయినాబాద్‌రూరల్: బాకారంలో...



చేవెళ్ల: గుండాలలో లడ్డూ దక్కించుకున్న గంగిడి జంగారెడ్డి



షాబాద్: తిర్మలాపూర్‌లో లడ్డూ వేలంలో పాల్గొన్న గ్రామస్తులు



షాద్‌నగర్: గణనాథుడి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంపీ డీకే అరుణ



చేవెళ్లలో వినాయకుడి పూజలో పాల్గొన్న మాజీ ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, నాయకులు

లడ్డూ వేలంలో భార్యాభర్తల పోటీ

రూ 5.35లక్షలకు గణనాథుడి ప్రసాదాన్ని దక్కించుకున్న దంపతులు



లడ్డూలను దక్కించుకున్న మనోజ్‌కుమార్, కీర్తన దంపతులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఆనంద్‌నగర్ కాలనీలో నెలకొల్పిన గణనాథుడి నిమజ్జనం సందర్భంగా సోమవారం లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో పట్టణానికి చెందిన మనోజ్‌కుమార్, కీర్తన దంపతులు పాల్గొని పోటాపోటీగా లడ్డూ ధరను పెంచుతూ వేలం పాడారు. లక్షల్లో వేలం పాడిన ఆ దంపతులు పెద్ద, చిన్న లడ్డూలను కైవసం చేసుకున్నారు. భర్త మనోజ్‌కుమార్ రూ.3లక్షలకు పెద్ద లడ్డూ, భార్య రూ.2.35లక్షలకు చిన్న లడ్డూను దక్కించుకున్నారు. లక్షల్లో వేలం పాడి లడ్డూలను దక్కించుకోవడంపై స్థానికులు దంపతులను అభినందిస్తున్నారు. అనంతరం మండప నిర్వాహకులు దంపతులను సన్మానించి లడ్డూలను అందజేశారు.